జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష

మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మద్దూర్ (కొత్తపల్లి), ఏప్రిల్ 18: కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డిపల్లెలో వెలసిన శ్రీ గురు లోకమసందు ప్రభు (బావోజీ)జాతర ఉత్సవాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ఈనెల 22నుంచి 25వరకు జరిగే బావోజీ జాతర సందర్భంగా గురువారం ఆలయ ఆవరణలో సంబంధిత శాఖల అధికారులతో జాతర ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి వసతి కల్పించాలని, అలాగే మరుగుదొడ్ల నిర్మాణం ఎంతవరకు వచ్చిందని, ఎన్ని మరుగుదొడ్లు నిర్మిస్తున్నారని అధికారులకు అడిగి తెలుసుకున్నారు. అలాగే నీటి సౌకర్యం కల్పించాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. ఈనెల 22న జాతర ప్రారంభం కానుందని, 21న జాతర విధుల్లో పాల్గొనే అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాతర విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది ఈనెల 21 న ఇక్కడ విధుల్లో చేరాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాతరలో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులు సిబ్బందికి ఐడెంటీ కార్డులు ఇవ్వాలని డీఎల్‌పీవోను ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు డ్రెస్ చేంజింగ్ గదులను ఏర్పాటు చేయాలన్నారు. జాతరలో ఎవరైనా తప్పిపోతే అనౌన్స్ చేయడానికి ప్రత్యేకంగా ఒక కేంద్రాన్ని , అవసరమైనా మైక్‌సెట్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జాతరలో సేకరించిన చెత్తచెదారం తరలించే ట్రాక్టర్ వెళ్లేందుకు జాతర ప్రాంగణంలో రహదారి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆలయ ఆవరణ నుంచి జరిగే రథోత్సవంలో ఎలాంటి అపశ్రుతి జరగకుండా అధికారులకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. రథం వెళ్లేదారిలో విద్యుత్ తీగలు లేకుండా చూసుకోవాలన్నారు. ఆలయంతోపాటు జాతర ప్రాంగణమంతా విద్యుత్ ఆలంకరణ చేయాలన్నారు. ఆలయం చుట్టూ జాతర ప్రాంగణంలో ప్రతి రోజు బ్లీచింగ్ పౌడర్ చల్లి, దుర్గంధం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాతర ఏర్పాట్లపై అన్నిశాఖల అధికారులతో స్థానిక తాసీల్దార్, ఎంపీడీవో సమన్వయం చేసుకొని పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం అధికారులతో కలిసి జాతర ప్రాంగణాన్ని పరిశీలించారు. ఇక్కడ కొనసాగుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కాడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఈనెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- 29న ఉపసంహరణకు అవకాశం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 18 : మహబూబ్‌నగర్ నియోజకవర్గం పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గురువారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 18వ తేదీ నుంచి 25 వరకు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లను కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 21న ఆదివారం మినహాయించి ఏడు రోజులు పాటు స్వీకరణ ఉంటుందని, 26న నామినేషన్ల పరిశీలన, 29న అభ్యర్థుల ఉపసంహరణకు అవకాశం, మే 13న పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే జూన్ 4న పాలమూరు యూనివర్సిటీలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఫామ్-26లో అన్ని వివరాలను పూరించాలని తెలిపారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరుగకుండా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 56 టీంలు పర్యవేక్షణలో, 213 సెక్టార్ ఆఫీసర్స్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రల్లో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. సాక్ష్యం యాప్‌లో పేరు నమోదు చేసుకుంటే, వీల్ చైర్‌తో పాటు ఇంటి నుంచి పోలింగ్ కేంద్రానికి వాహనం ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా పట్టుబడ డబ్బును జిల్లా గ్రీవెన్స్ ఆధీనంలో ఉంచుతారని, ఎన్నికలకు సంబంధం లేనివాటిని గ్రీవెన్స్ కమిటీ ద్వారా తిరిగి ఇవ్వనున్నట్లు తెలిపారు. సువిధ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి వాహనాలకు అనుమతి పొందవచ్చని, ఎన్నికల నిబంధన ఉల్లంఘనపై సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో 16లక్షల 80వేల మంది ఓటర్లు ఉన్నారని, 1,916 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణకు బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, పౌరసంబంధాల అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

20న ఎంవీఎస్‌లో మెగా జాబ్ మేళా

ప్లేస్మెంట్ డ్రైవ్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా.పద్మావతి

పాలమూరు, ఏప్రిల్ 18 : మహబూబ్‌నగర్ స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఈనెల 20వ తేదీన కళాశాల ప్లేస్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మావతి తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలైన టాటాస్త్రైవ్, రిలయన్స్‌జియో, ఎయిర్‌టెల్ పేమెంట్స్‌బ్యాంక్, ఈఎంఆర్ఐ, కల్కిహెచ్‌ఆర్ఐ సొల్యూషన్స్ టీమ్‌లీజ్, రామ్‌గ్రూప్ వంటి కంపెనీలు మేళాలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎస్‌సీసీ, ఇంటర్, డిగ్రీ అర్హత ఒక సెట్ జిరాక్స్, రెజ్యూమ్‌ను తప్పనసరిగా తీసుకురావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.1.50లక్షల నుంచి వార్షిక వేతనం ప్రారంభమవుతుందన్నారు. 20న ఉదయం 10గంటలకు హాజరుకావాలని తెలిపారు.

మెగాజాబ్ డ్రైవ్‌కు 274 మంది ఎంపిక

గురువారం స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో మెగాజాబ్ డ్రైవ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.పద్మావతి మాట్లాడుతూ మేళాకు 854 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 274 మంది అర్హత సాధించారని తెలిపారు. ఈ మేళాను అపోలో, టెక్ మహీంద్రా, స్పందన్‌స్ఫూర్తి, జెన్‌ప్యాక్ట్, మూత్తూట్ ఫైనాన్స్, మెడ్‌ప్లస్ వంటి కంపెనీ ప్రతినిధులు నిర్వహించారని, ఎంపికైన అభ్యర్థులకు రెండ్రోజుల్లో ఫైనల్ ఇంటర్వ్యూ ద్వారా ఆర్డర్ కాపీలు అందజేస్తామని ప్లేస్మెంట్ అధికారి డా.రంగసూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సత్యనారాయణగౌడ్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఈశ్వరయ్య, హరిప్రసాద్, రాజేందర్, డా,తిరుపతయ్య, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

పాలమూరు, ఏప్రిల్ 18: పాలమూరు విశ్వవిద్యాలయంలో గురువారం వేసవి సెలవులో భాగంగా ఎంబీఏ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయూష్ అసోసియేట్స్ సీవో శంకర్‌పవార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎం.కాం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఈ ఇంటర్న్‌షిప్ అనేది మైక్రోస్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజ్ చిన్న పరిశ్రమలు ముడిపదార్థాలను వస్తువులుగా మార్పిడి చేసే సంస్థలకు క్యూసీఐ క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వెళ్లి ఏడు పాయింట్ల నాణ్యతా ప్రమాణాలు చెక్ చేసి, స్థాయిని బట్టి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డా.రాజ్‌కుమార్, అధ్యాపకులు డా.నాగసుధ, డా.అర్జున్‌కుమార్, డా.అరుంధతిరెడ్డి, జావేద్‌ఖాన్, గాలెన్న వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

యువతి హత్యపై కొనసాగుతున్న దర్యాప్తు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 18: కేసీఆర్ అర్బన్ పార్క్‌లో ఓ యువతి కాలిపోయిన దేహం లభ్యమవడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇక్కడి సీసీ కెమెరాల్లో సైతం యువతి కదలికలు సరిగా కనిపించకపోవడంతో పాటు ఆ యువతి సంబంధీకులు కూడా ఎవరూ పోలీసులను ఆశ్రయించలేదు. ఇప్పటి వరకు గుర్తు తెలియని యువతిగా ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేసి, గురువారం ప్రభుత్వ జనరల్ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి, మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు. అయితే పార్క్‌లో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో చనిపోవడం చర్చనీయాంశంగా మారింది. పార్క్ ప్రధాన గేటు నుంచి కిలోమీటర్ దూరంలో కొండపై జాతీయ జెండాను ఏర్పాటు చేసిన ప్రాంతానికి సమీపంలో అడవిలో పొగరావడంతో పార్క్ సిబ్బంది అక్కడికి వెళ్లి చూడగా నిప్పంటుకొని కాలిపోతున్న యువతి కనిపించింది. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించేసరికే శరీరం అంతా కాలిపోయి, అక్కడికక్కడే చనిపోయింది. పోలీసులు క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. యువతి డ్రెస్ ఆధారంగా పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో సీసీ పుటేజీలో యువతి ఒక్కతే ముఖానికి ముసుగు ధరించి లోపలికి వెళ్లినట్లు కదలికలను పోలీసులు గుర్తించారు. మృతురాలి వస్తువుల ఆధారంగా పోలీసులు గుర్తించడానికి కూడా సెల్‌ఫోన్ కూడా పూర్తిగా కాలిపోయింది. దీంతో పోలీసులకు కేసు ఛేదించడానికి కష్టంగా మారింది. అయితే పకడ్బందీగా అమ్మాయిని ఎవరో హత్యచేసి, ప్లాన్ ప్రకారం ఆధారాలు దొరకకుండా పథకం పన్నారని తెలుస్తోంది.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్

- మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 18: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ చెప్పారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీఎం పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. సభాప్రాంగణం, ర్యాలీ జరిగే రూట్ ఏర్పాట్లు పరిశీలించారు. పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని సూచించారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ చిత్తరంజన్, అదనపు ఎస్పీ రాములు, ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ బాలకోటి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

- వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్

జానంపేట దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న రవీందర్‌నాయక్

మూసాపేట, ఏప్రిల్ 18 : మండలంలోని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్ సందర్శించారు. దవాఖానలో వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ప్రజలు, ఉపాధి కూలీలకు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో ఆధునిక సౌకర్యాలతో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీధర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్‌నాయక్, డాక్టర్ షభానాబేగం ఉన్నారు.

అనన్యరెడ్డిని సన్మానించిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు

అనన్యరెడ్డిని సన్మానిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

మూసాపేట(అడ్డాకుల), ఏప్రిల్ 18 : యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌గా ఎంపికైన దోనూరు అనన్యరెడ్డిని మహబూబ్‌నగర్‌లోని ఆమె నివాసంలో గురువారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అభినందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండా జగదీశ్వర్, హేమవర్ధన్‌రెడ్డి, డీఎల్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

దేవరకద్ర, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఆర్వోబీ కింద ప్రమాదవశాత్తు గుర్తు తెలియని వ్యక్తి(65) మృతదేహం లభ్యమైందని ఎస్సై నాగన్న తెలిపారు. పోస్టుమార్టం కోసం దవాఖానకు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జర్నలిస్ట్ మృతికి సంతాపం

భూత్పూర్, ఏప్రిల్ 18 : పట్టణంలోని అమిస్తాపూర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎండవెట్ల రాములు(52)అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. 20ఏండ్లు వివిధ దినపత్రికల్లో పనిచేసిన ఆయన క్యాన్సర్‌తో మృతిచెందడంపై ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మాగనూర్, ఏప్రిల్ 18: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని గురువలింగంపల్లిలో బుధవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన రైతు రంగమోల సుగురప్ప ఎద్దు, రోజుమాదిరిగా పొలానికి మేత కోసం వెళ్లి ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలియడంతో వెటర్నరీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని, పోస్టుమార్టం చేశారు. ఎద్దు విలువ రూ.80వేల వరకు ఉంటుందని తెలిపారు. రైతును ఆదుకోవాలని కోరారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

- అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

మక్తల్ టౌన్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా భారత ఎన్నికల సంఘం ఎన్నికల కోడ్‌లోని నియమావళిని ప్రతి రాజకీయ పార్టీ నాయకులు పాటించాలని నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. గురువారం మక్తల్ తాసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినందు వల్ల ప్రతి ఒక్క రాజకీయ పార్టీ ఎన్నికల నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా పనులు చేస్తే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ సువర్ణరాజ్, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు

వైభవంగా రాములోరి పట్టాభిషేకం

పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాలమూరు, ఏప్రిల్ 18: మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి పట్టాభిషేకం నిర్వహించారు. ఓబులాయపల్లి, కోటకదిర గ్రామస్తులు స్వామివారి ఆలయంలో అఖండ భజన చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మధుసుదన్‌కుమార్, ఈవో శ్రీనివాసరాజు, పర్యవేక్షకులు నిత్యానందచారి పాల్గొన్నారు.

మజ్జిగ వితరణ

పాలమూరు, ఏప్రిల్ 18 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర విభాగ అధిపతి డా.విజయలక్ష్మి, అధ్యాపకులు రాజేశ్వరి, రవళి, సూరయ్య, జబీన్, కేశవర్ధన్‌గౌడ్, రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

పాలమూరు, ఏప్రిల్ 18: సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై దాడిన చేసిన ఏబీవీపీ నాయకులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద గురువారం ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు వంద మంది మతోన్మాద మూకలు విద్యార్థులపై దాడి చేశారని ఆరోపించారు. రెండ్రోజుల కిందట పీడబ్ల్యూ విద్యార్థిపై దాడి చేసి కూడా చేయలేదని అబద్ధపు ప్రచారం చేసిందన్నారు. ఏబీవీపీ అబద్ధాలను ఎస్ఎఫ్ఐ సాక్ష్యాలతో సహా నిరూపించిందన్నారు. కావాలనే దివ్యాంగ విద్యార్థిపై దాడి చేసిందని నిరూపించడంతో, విద్యార్థుల్లో స్థానం కోల్పోయిన ఏబీవీపీ మళ్లీ దాడిని ప్లాన్ చేసి అర్ధరాత్రి హాస్టల్‌లో దూరి దాడికి పాల్పడ్డారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భరత్, ఉపాధ్యక్షుడు నందుఈశ్వర్, నాయకులు శివ, రాజు, రాము, రమేశ్ తదితర ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

అగ్ని నివారణ చర్యలు తీసుకుందాం

అరబిందో ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదాల నివారణపై డెమో చూయిస్తున్న సిబ్బంది

జడ్చర్లటౌన్, ఏప్రిల్ 18: అగ్ని నివారణ చర్యలు తీసుకుందాం.. దేశ సంపదను కాపాడుదాం అనే నినాదంతో అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి కిశోర్ అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని అరబిందో ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి కిశోర్ మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉంటూ చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిప్రమాదం సంభవిస్తే ఫైర్ ఎగ్జిట్ సూచికలను అనుసరించాడాన్ని వివరించారు. ప్రధానంగా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు లిఫ్ట్‌ను వినియోగించొద్దని, మెట్లను మాత్రమే ఉపయోగించాలన్నారు. ప్రమాద సూచికలకు సంబంధించిన ఆలారం సిస్టం వినియోగం గురించి, వివరిస్తూ మంటలు వ్యాపించినప్పుడు మంటలు ఆర్పేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో డెమోతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్చర్ల అగ్నిమాపక శాఖాధికారి మల్లికార్జున్, సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రామచంద్రయ్య, నవీన్‌కుమార్, రాజేందర్ నాయక్, రవికుమార్, ఖాజా, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

21న సన్నాహక సమావేశం

మూసాపేట, ఏప్రిల్ 18 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈనెల 21వ తేదీన అడ్డాకుల మండల కేంద్రంలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, జెడ్పీటీసీ ఇంద్రయ్యాసాగర్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంతోపాటు, వేముల, జానంపేట, అచ్చాయిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు కోసం నిర్వహించే ఈ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ధన్వాడ, మరికల్ మండలాల అభివృద్ధికి కృషి

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ధన్వాడలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

ధన్వాడ, /మరికల్, ఏప్రిల్ 18 : మహబూబ్‌నగర్ ఎంపీగా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని, ధన్వాడ, మరికల్ మండలాల్లో ఎమ్మెల్యే ఎన్నికలకంటే ఒక్కఓటు అధికంగా వచ్చినా రెండు మండలాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. గురువారం ధన్వాడ మండల కేంద్రంలో మరికల్, ధన్వాడ మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కొడగంల్-నారాయణపేట ఎత్తిపోతల, ధన్వాడలో డిగ్రీ కళాశాలకు సొంత భవనం, మరికల్‌లో జూనియర్ కళాశాల ఏర్పాలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పేట డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి, శివకుమార్ రెడ్డి ఉన్నారు.

జాబ్ కార్డుదారుడికి 200 రోజుల పని కల్పించాలి

ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సీఐటీయూ నాయకులు

నారాయణపేటరూరల్, ఏప్రిల్ 18 : ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 200 రోజుల పని కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేట మండలంలోని అప్పిరెడ్డిపల్లి, అమ్మిరెడ్డిపల్లిలో ఉపాధి కూలి పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారికి కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకొన్నారు. ప్రతి రోజు కూలి రూ.600 చెల్లించాలని, వారికి మంచినీటి వసతి ఏర్పాటు చేయడంతో పాటు పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. కూలీలు మరణిస్తే వారికి రూ.10 లక్షలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, వెంకట్‌రాములు, హజిమలాంగ్, గోవిందు, లక్ష్మి, అరుణ, గోవిందమ్మ, కవిత పాల్గొన్నారు.

కొలతలతో సంబంధం లేకుండా పని కల్పించాలి

ఊట్కూర్, ఏప్రిల్18: ఉపాధి కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా పని కల్పించి రూ.600 కూలి చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బిజ్వార్‌లో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలందరికీ 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు తాగు నీరు. టెంట్ సౌకర్యం, మెడికల్ సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు బాల్‌రాం, శివప్పగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

మక్తల్ అర్బన్, ఏప్రిల్ 18: మక్తల్ పట్టణంలోని షిర్డీసాయి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించామని, మధ్యాహ్నం ఖానాపూర్ మల్లేశ్ సహకారంతో భక్తులకు అన్నదానం చేశామని అర్చకులు మల్లికార్జున్ తెలిపారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

ఊట్కూర్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణమ్మ నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, వెంకట్రాములు, రాజవర్ధన్‌రెడ్డి, అశోక్, వెంకటప్ప, ఆంజనేయులుగౌడ్, రవి పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT MAHABUBNAGAR
IA No.711/2022
IN
O.S.No.85 of 2019
Between
Bank of Baroda, Mahabubnagar Branch, Rep. by its Branch Manager ... Plaintiff
And
M/s Lax Info Solutions, rep. by its Proprietor, Sri E. Ramesh Babu ... Defendant
To
M/s Lax Info Solutions, rep. by its proprietor Sri E. Ramesh Babu, S/o E.Srinivasulu, aged major, business, address H.No. 1-3-160/16/5, Rajendranagar, Mahabubnagar Town and District, R/o H.No.8-5-278, Venkateshwara colony, Mahabubnagar. (Defendant)
NOTICE
Take notice of the fact that the plaintiff filed the above suit for recovery of amount against you, in the above case the Hon'ble court directed you the above named defendant to give your appearance before the Hon'ble court on 23-04-2024 at 10-30AM, Hence you the above named defendant is hereby directed to appear before the court without fail on the said date, otherwise the matter will be decided as exparte against you.
// By order of the Court //
SWADESH, B.A.L.L.B., Advocate
H.No.2-50, Christianpally, Mahabubnagar
Cell No. 9030520436

'ఉపాధి'లో అక్రమాలపై విచారణ చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న శంకరాయపల్లి తండావాసులు

జడ్చర్లటౌన్, ఏప్రిల్ 18: జడ్చర్ల మండలం శంకరాయపల్లి తండాలో ఉపాధి హామీ పథకం ప నుల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని కోరుతూ తండావాసులు గురువారం జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. శంకరాయపల్లితండా లో రెండేండ్లుగా ఎలాంటి పనులు చేపట్టకపోయినా, పనులు చేసినట్లు చూపి రూ.15లక్షలు డ్రా చేసుకున్నారని, ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌తో పాటు గ్రామకార్యదర్శుల పాత్ర ఉందని ఆరోపించారు. దీనిపై అధికారులు గతంలో నామమాత్రంగా విచారణ చేసి వదిలిపెట్టారని, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బిచ్యానాయక్, కిషన్‌నాయక్, రాజు, మధు, మ ణ్యం, పాండు, ఆంజనేయులు, రాఘవేంద ర్ పాల్గొన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో బాల్‌రెడ్డిని వివరణ కోరగా ఉపాధిహామీ పథ కం పనుల్లో అక్రమాలను గురించి కలెక్టర్ దృష్టికి వెళ్లింది. కలెక్టర్ ఆదేశాల మేరకు దీనిపై ఏపీడీ చేత విచారణ కొనసాగుతోందన్నారు.

ప్రజలు ధైర్యంగా ఓటు వేయాలి

మాగనూరు, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై అబ్దుల్ ఖాదర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గురువారం సాయంత్రం మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు అడవిసత్యారం, అమ్మపల్లి గ్రామాల్లో కేంద్ర సాయుధ, పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

జాతర బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

మద్దూర్(కొత్తపల్లి), ఏప్రిల్ 18: జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తామని డీఎస్పీ ఎన్. లింగయ్య అన్నారు. తిమ్మారెడ్డిపల్లిలో ఈనెల 22 నుంచి 25వరకు జరగబోయే బావోజీ జాతర పరిసరాలను గురువారం ఆయన పరిశీలించారు. ట్రాఫిక్ పాయింట్స్, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. జాతరలో ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మద్దూర్ ఎస్సై రామ్‌లాల్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ బియ్యం అందించాలి

దేవరకద్ర, ఏప్రిల్ 18 : రైస్‌మిల్లుల్లో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ఎఫ్ బియ్యాన్ని వెంటనే ప్రభుత్వానికి అందించాలని తాసీల్దార్ శ్రీనివాసులు రైస్‌మిల్ యజమానులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని రైస్‌మిల్‌తోపాటు మండలంలోని బల్సుపల్లి సమీపంలోని రైస్‌మిల్‌ను తాసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

పంటరుణాలు రెన్యూవల్ చేసుకోవాలి

దామరగిద్ద, ఏప్రిల్ 18: పంట రుణాలు తీసుకున్న రైతులు, వెంటనే రెన్యూవల్ చేసుకోవాలని దామరగిద్ద ఎస్‌బీఐ మేనేజర్ జైపాల్ కోరారు. బ్యాంకు ఆవరణలో ఖాతాదారులతో, రైతులతో మాట్లాడుతూ రెన్యూవల్ చేసుకుని అపరాధ రుసుము పడకుండా చేసుకోవాలని అన్నారు.